# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

**తేది : 20-01-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామని పశు సంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు.**
2. **గనుల రంగంలో సంస్కరణలను తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని ఆ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.**
3. **రాష్ట్రంలో ఆధార్ కార్డుకు దరఖాస్తు చేసుకోని 5 సంవత్సరాలలోపు పిల్లల కోసం రేపటి నుంచి సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నామని ప్రభుత్వం పేర్కొంది.**
4. **తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలు ముగియడంతో ఈరోజు నుంచి సాధారణ దర్శనాలు ప్రారంభమయ్యాయి.**

=========================

తిరుపతి పార్లమెంట్ పరిధిలో కేంద్రప్రభుత్వ నిధులతో 100 పడకల ఇఎస్ఐ ఆసుపత్రులను ఏర్పాటు చేస్తున్నామని తిరుపతి పార్లమెంట్ సభ్యులు మద్దెల గురుమూర్తి తెలిపారు. తిరుపతిలో ఆయన ఈరోజు మాట్లాడుతూ, తిరుపతిలో 100 పడకల ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. సత్యవేడు, సర్వేపల్లిలలో కూడా 100 పడకల ఆసుపత్రులను ఏర్పాటు చేయనున్నామని తెలుపుతూ,

వాయిస్ .. 29 సెకన్లు

-------------------------

రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామని పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం చిర్రావురు గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను మంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి మండలంలో ఒక పశువైద్యుడు, నలుగురు సిబ్బందితో రెండు బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ బృందాలు రోజుకు రెండు గ్రామాల్లో పశువులను పరీక్షించి వైద్యం, అవసరమైన తేలిక పాటి శస్త్రచికిత్సలు చేస్తారని తెలిపారు. నట్టల నివారణ మందుల పంపిణీ, వ్యాధి నిరోధక టీకాలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

-------------------------

గనుల రంగంలో సంస్కరణలను తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని

గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరుగుతున్న నేషనల్ మైనింగ్ మినిస్టర్స్ సమావేశంలో మంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మైనింగ్ రంగంలో ఆంధ్రప్రదేశ్ అత్యంత పారదర్శక విధానాలను అవలంభిస్తోందని అన్నారు. గనుల లీజుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం సంస్కరణలు చేపడితే మరింత పారిశ్రామికాభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

గిరిజన గ్రామాలలో వైద్య సేవల పట్ల అవగాహన కల్పించాలని పాడేరు శాసనసభ సభ్యులు ఎం.విశ్వేశ్వర రాజు వైద్యాధికారులకు సూచించారు. పాడేరులోని జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వెల్నెస్ కేంద్రాన్ని ఈరోజు ఆయన ప్రారంభించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది గిరిజన వసతిగృహాలలో విద్యార్థిని విద్యార్థులకు నిత్యం వైద్య పరీక్షలు, నిర్వహించాలని పేర్కొంటూ..

వాయిస్ ..27 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో ఆధార్ కార్డుకు దరఖాస్తు చేసుకోని 5 సంవత్సరాలలోపు పిల్లల కోసం రేపటి నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నామని ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రంలో 11లక్షల 65 వేల 264 మంది చిన్నారులు ఉన్నారని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలలో బాల ఆధార్ నమోదుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది.

---------------------------

'స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా నెలకో అంశం చొప్పున 12 కార్యక్రమాలు అమలు చేయనున్నామని స్వచ్ఛాంధ్ర సంస్థ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. అమరావతిలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, గత ఆరు నెలల్లో డంపింగ్ యార్డులల్లో 54 శాతం వ్యర్థాలను శుభ్రం చేయించామని, మిగిలిన 46.59 లక్షల టన్నులను అక్టోబరు 2 నాటికి పూర్తి చేయిస్తామని అన్నారు. రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లోనూ మురుగునీటిని శుద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. ఘన వ్యర్థాల సమస్య పరిష్కారానికి రాజమహేంద్రవరం, నెల్లూరులతో పాటు రాయలసీమలో మూడు విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లును ఏర్పాటు చేయనున్నామని పట్టాభిరామ్ వివరించారు.

---------------------------

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలు ముగియడంతో నుంచి సాధారణ దర్శనాలు యధావిధిగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 10 వ తేదీ నుంచి మొదలైన దర్శనాలు నిన్న అర్ధరాత్రితో ముగిశాయి. ఈ పది రోజుల్లో దాదాపు 6 లక్షల 83 వేల 304 మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని.. ఉత్తరద్వార దర్శనం చేశారని తిరుమల తిరుపతి దేవస్థానం ఒక ప్రకటనలో తెలిపింది.

---------------------------

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారంలో మరింత పురోగతి సాధించవచ్చని ప్రకాశం జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ అమ్మన్నరాజా అన్నారు. ఒంగోలులోని ప్రకాశం జిల్లాన్యాయస్థానంలో మీడియేషన్ పై ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడం ద్వారా కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని అన్నారు. జిల్లాలోని 30 మంది నిపుణులు మధ్యవర్తిత్వంకి సంబంధించిన వివిధ అంశాలపై న్యాయవాదులకు అవగాహన కల్పించడంతో పాటు శిక్షణ ఇస్తారని ఆయన తెలుపుతూ,

వాయిస్ (28 సెకన్లు)

---------------------------

ఖోఖో పురుషుల, మహిళల ప్రపంచకప్‌లో భారత జట్లు విజేతగా నిలవడం గర్వించదగ్గ విషయమని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ ఏ. రవినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా మహిళల విభాగంలో 23 దేశాల జట్లు, పురుషుల విభాగంలో 19 దేశాల జట్లు తలపడగా భారత జట్లు అద్భుత ప్రతిభను కనబరిచాయని చెప్పారు. ఈ సందర్భంగా భారత జట్లకు శాప్ తరపున అభినందనలు తెలియజేశారు. ముఖ్యంగా భారత పురుషుల జట్టులో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన ప్రకాశం జిల్లా క్రీడాకారుడు పి.శివారెడ్డికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 30 సెకన్లు....

---------------------------

గ్రామ పంచాయతీలో జరిగే సర్వసభ్య సమావేశాలకు ఆ పంచాయతీ పరిధిలోని సచివాలయాల సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని గ్రామ, వార్డు సచివాయాల శాఖ ఆదేశాలు జారీ చేసింది. మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో జరిగే సమావేశాలకు వాటి పరిధిలోని వార్డు సచివాలయాల సిబ్బంది, అలాగే గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులందరూ సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు తగిన చర్యలు చేపట్టాలని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ సంచాలకులు శివప్రసాద్ ఆదేశాల్లో పేర్కొన్నారు.

======================